క్లుప్తంగా

పెచ్చులూడుతున్న తహసీల్దార్ కార్యాలయం

- భయాందోళనలో సిబ్బంది



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం పైకప్పు పెచ్చులూడి పడుతోంది. దీంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ పని చేస్తున్నారు. నిత్యం కార్యాలయానికి వివిధ పనులపై రైతులు, విద్యార్థులు పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారు. పైకప్పు పెచ్చులూడటంతో భయాందోళన చెందుతున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో పెచ్చులూడుతోందని, కనీసం తాత్కాలిక మరమ్మతులు లేదా నూతన భవనం నిర్మించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

విభిన్న ప్రతిభావంతులకు నేడు వైద్య శిబిరం

వెంకటాచలం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విభిన్న ప్రతిభావంతులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ–1 పి.సుధీర్ ప్రేమ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లలోపు విభిన్న ప్రతిభావంతులు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, రేషన్‌కార్డు, మూడు ఫొటోలు తీసుకుని హాజరుకావాలని తెలియజేశారు. ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహించి ఉపకరణాలు అందజేస్తామని తెలిపారు.

స్వచ్ఛంద నేత్రదానం సంప్రదాయంగా మారాలి

- జిల్లా అంధత్వ నివారణ సంస్థ డాక్టర్ శార్వాణి



పోస్టర్లను ప్రదర్శిస్తున్న డాక్టర్ శార్వాణి తదితరులు

నెల్లూరు(అర్బన్): స్వచ్ఛంద నేత్రదానాన్ని కుటుంబ సంప్రదాయంగా మార్చుకోవాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ శార్వాణి అన్నారు. ఆ సంస్థ, పీహెచ్‌పీ (పీఎంపీ) సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులోని వేదాయపాళెంలోని నెల్లూరు స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. పోస్టర్లు ఆవిష్కరించిన అనంతరం శార్వాణి మాట్లాడుతూ ఎవరైనా మరణించిన ఆరు గంటల్లోపు నేత్రాలను దానం చేస్తే మరో ఇద్దరి అంధులకు చూపును ప్రసాదించవచ్చన్నారు. శ్రీలంకలో నేత్రదానం చేసేవారి సంఖ్య చాలా ఎక్కువగా ఉందన్నారు. అయితే సంప్రదాయాల పేరిట మనదేశంలో అతితక్కువ మంది మాత్రమే నేత్రదానం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, సభ్యులు రామరఘురామయ్య, శంకరరావు, నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ మల్లికార్జున, ట్యూటర్స్ శిల్ప, సుప్రియ, విద్యార్థినులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రం సందర్భంగా బాలాజీ నగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా కోట సత్యనారాయణ – సుభాషిణి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను ఆ మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి కొప్పరపు శివప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

రాజరాజేశ్వరి సన్నిధిలో విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రాహుకాల ఉద్యాపన పూజను విశేషంగా నిర్వహించారు. త్రయోదశి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని మీనాక్షి సుందరేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం వివిధ పూజా కార్యక్రమాలు జరిగాయి.

➡ సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం సాయంత్రం 4:30 గంటలకు ఆలయం మూసివేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దనరెడ్డి తెలిపారు.

తవ్వేద్దాం.. అమ్మేద్దాం

- జొన్నవాడ కరకట్ట పక్కన యథేచ్ఛగా తవ్వకాలు
- బుచ్చి పట్టణంలో లేఅవుట్లకు తరలింపు
- వరదొస్తే సమీప గ్రామాల అడ్రస్ గల్లంతు
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు



జొన్నవాడ వద్ద పెన్నానది సమీపంలో ట్రాక్టర్లకు మట్టిని లోడ్ చేస్తున్న జేసీబీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ పెన్నా తీర ప్రాంతంలో పొలాల నుంచి గత 20 రోజులుగా మట్టిని తవ్వి బుచ్చిరెడ్డిపాళెం పట్టణంతో పాటు సమీప ప్రాంతాల్లోని లేఅవుట్ల నిర్మాణాలకు తరలిస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్లు మట్టిలోడుతో వెళ్తున్నాయి. దీంతో జొన్నవాడ, పెనుబల్లి, సాల్మన్‌పురం, బుచ్చిరెడ్డిపాళెం పట్టణం ట్రాక్టర్ల శబ్దంతో హోరెత్తుతున్నాయి. ఇష్టారీతిన అధిక స్పీడుతో ట్రాక్టర్లు వెళ్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని హడలిపోతున్నారు. చిన్నారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఆయా మార్గాల్లో సైకిళ్లపై వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని సమీప గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు మట్టిపై పట్టలు కప్పకుండా వేగంగా వెళ్తుండటంతో వెనుక వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు, పాదచారుల కళ్లల్లో మట్టిపడిన ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి.

పొంచి ఉన్న ప్రమాదం

సాధారణంగా జిల్లాలో సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో అధిక వర్షపాతం నమోదవుతుంటోంది. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు పడితే పెన్నానది తీర ప్రాంతాలకు తీవ్ర ముప్పు పొంచి ఉంది. ఇష్టారీతిన మట్టి, ఇసుక తవ్విన గుంతలు ఉన్నందున నది పొంగితే జొన్నవాడ, పెనుబల్లి, కాగులపాడు, దామరమడుగు, కోవూరు మండలంలోని పోతిరెడ్డిపాళెం, సాలుచింతల, కోవూరు గ్రామ పంచాయతీల్లోని పలు గ్రామాలు అలాగే నెల్లూరు సిటీ పరిధిలోని వెంకటేశ్వరపురం ముంపునకు గురవుతాయి. ఇదే జరిగితే వేలాది ప్రజల జీవనం అస్తవ్యస్తం అవుతోంది. వ్యవసాయం, పాడిపరిశ్రమ దెబ్బతిని రైతులు కనీవినీ ఎరుగని రీతిలో నష్టాల పాలవ్వాల్సి వస్తోంది. ముంబై రహదారిపై నీరు చేరడం, రహదారి కోతకు గురవడం లాంటి ఘటనలు జరిగితే ఆర్థికంగా జిల్లాకు కోలుకోని నష్టం వాటిల్లుతుంది. ఇవన్నీ అధికారులకు తెలిసినా అక్రమ మట్టి తవ్వకాలను మాత్రం అడ్డుకోవడం లేదు.

నాయకుల అండదండలతో...

జొన్నవాడ నుంచి శేషారెడ్డి అనే వ్యక్తి మట్టిని తరలిస్తున్నారు. ఈయనకు బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీకి చెందిన ఓ టీడీపీ కౌన్సిలర్, ఇతర టీడీపీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఆయన ఆడిందే ఆట పాడిందే పాటగా రాత్రి పగళ్లు మట్టి తరలించి రూ.లక్షలు గడిస్తున్నారు. మట్టి తరలింపుపై ప్రజలు ప్రశ్నిస్తే.. వారిపై దాడులకు పాల్పడే అవకాశం ఉండటంతో ఎవరూ నోరుమెదపడం లేదు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుచ్చిరెడ్డిపాళెం వచ్చినప్పుడల్లా ఇసుక, మట్టి, గ్రావెల్ మాఫియాలో తమ పార్టీ నాయకులు ఉన్నా ఉపేక్షించేది లేదని పదేపదే చెబుతుంటారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. గ్రావెల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని అధికారులను గానీ, పార్టీ నాయకులను గానీ ఆదేశించడం లేదు. ఇదిలా ఉంటే గురువారం కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పెన్నా పొర్లుకట్టలను పటిష్ట పరచాలని కోరడం కొసమెరుపు. ఇష్టారాజ్యంగా తమ పార్టీ నాయకులు, వారి అండదండలతో పెన్నా పొర్లుకట్టలను ధ్వంసం చేస్తుంటే చర్యలు తీసుకోవాల్సింది పోయి, పొర్లుకట్టలను పటిష్ట పరచాలని కోరడంపై తీర ప్రాంతాల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



మట్టి తవ్వడం వల్ల ఏర్పడిత గుంత

అధికారుల తనిఖీలేవీ?

యథేచ్ఛగా మట్టి మాఫియా చెలరేగిపోతున్నా మండల రెవెన్యూ అధికారులు, విజిలెన్స్, మైనింగ్, పోలీసు అధికారులు కనీస తనిఖీలు జరపడం లేదు. మట్టి ట్రాక్టర్లు జొన్నవాడ మీదుగా పెనుబల్లి, బుచ్చి పట్టణం గుండా వెళ్తున్నా అధికారులు చూసీచూడనట్లు వెళ్లిపోతున్నారు. అందులోనూ ఉద్దేశపూర్వకంగా ట్రాక్టర్లకు నంబర్లను తీసువేస్తూ తరలిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోకపోతే.. పెన్నమ్మ ఆగ్రహానికి గురికాక తప్పదని నదీతీర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెనుబల్లి వద్ద పట్ట కప్పకుండా నంబర్ ప్లేట్ కూడా లేకుండా మట్టిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్

వైఎస్సార్‌సీపీ ఆందోళనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రజత్‌కుమార్‌రెడ్డి

కోవూరు: రైతులకు మద్దతుగా సెప్టెంబర్ 9వ తేదీ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరులోని ఆయన నివాసంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. రైతులకు యూరియా, ఎరువులను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. క్రాప్ బీమాను అమలు చేయకపోవడం, వరదల కారణంగా దెబ్బతిన్న పంటకు నష్టపరిహారం అందించకపోవడం, పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9వ తేదీ ఉదయం 9 గంటలకు నెల్లూరు వీఆర్సీ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీగా ప్రారంభమై, కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం అందజేస్తామని వివరించారు. కోవూరు నియోజకవర్గం నుంచి రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నరసింహులురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనర్లు అనూప్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సతీష్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, షాహుల్, శేషగిరిరావు, సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, కృష్ణమోహన్, రూప్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



ముత్తుకూరులో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు

ముత్తుకూరు(పొదలకూరు): ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోగుల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యానికి మద్దతు ధర కోసం ఈనెల 9న ఉదయం 10 గంటలకు నెల్లూరు గాంధీ బొమ్మ వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. కేంద్రం ప్రకటించిన దాని ప్రకారం పుట్టి ఏ గ్రేడ్ రకానికి రూ.20,306, సాధారణ రకానికి రూ.20,136లకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గడ్డం అంకయ్య, సభ్యులు జయరామయ్య, మస్తానయ్య, నాగరాజు, శ్యామ్‌ప్రసాద్, భాస్కర్, మోహన్‌రావు, సలామ్ పాల్గొన్నారు.

➡ **తోటపల్లిగూడూరు:** మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు మారుబోయిన రాజా డిమాండ్ చేశారు. నరుకూరు సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ పుట్టికి రూ.19,720లను ప్రభుత్వం మద్దతు ధరగా ప్రకటిస్తే మిల్లర్లు, దళారులు రూ.16 వేలకు కొనుగోలు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా తేమ పేరుతో మరో 50 కేజీలను అదనంగా తీసుకొంటున్నారన్నారు.

మర్యాదపూర్వకంగా..



ఇందుకూరుపేట: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన నివాసంలో పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఆయన వెంట సీనియర్ నాయకుడు షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో లారీ బోల్తా



ఇందుకూరుపేట: మండలంలోని డేవిస్‌పేటలో స్టార్ ప్రాసెసింగ్ ప్లాంట్ సమీపాన ఉన్న కాలువలో శుక్రవారం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు.. మైపాడు నుంచి నెల్లూరు వైపు ధాన్యం లోడుతో లారీ బయలుదేరింది. ఈ క్రమంలో డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో లారీ అదుపుతప్పి కాలువలో బోల్తా పడింది.

కాగా ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు వివరించారు. బోల్తా పడిన లారీలో ఉన్న ధాన్యాన్ని మరో లారీలోకి తరలించారు.

రేపు కామాక్షితాయి ఆలయం మూత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయాన్ని చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేస్తామని ఈఓ, అర్చభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం యథావిధిగా భక్తులను దర్శనానికి అనుమతిస్తామని పేర్కొన్నారు.

ఎస్టీల సమస్యలపై నేడు ప్రత్యేక గ్రీవెన్స్‌డే

కోవూరు: మండల పరిధిలోని ఎస్టీ ప్రజలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ డే శనివారం ఉంటుందని తహసీల్దార్ సుబ్బయ్య శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుందని, మండలంలోని అన్ని గ్రామాల ఎస్టీ ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించుకోవాలని కోరారు.

పరిష్కరించుకోండి

కొడవలూరు: షెడ్యూల్డ్ తెగల(ఎస్టీ)కు చెందిన రైతుల భూ వివాదాల పరిష్కారం కోసం కావలి ఆర్డీఓ కార్యాలయంలో శనివారం ప్రత్యేక గ్రీవెన్స్‌డేను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ వివాదాలున్న షెడ్యూల్డ్ తెగలకు చెందిన రైతులు గ్రీవెన్స్‌డేలో వినతులు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

పొదలకూరు: పట్టణంలోని నెల్లూరు మార్గం టైలర్స్ కాలనీలో బీజేపీ కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సురేష్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బాలిరెడ్డి మారుతిరెడ్డి, మండల నాయకులు సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, ధనుంజయరావు, దాసరి సురేంద్రబాబు, చౌప్పా వెంకటేశ్వర్లు, ఎం.రవీంద్రబాబు, సుధాకర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కోవూరు: మండల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.మధుసూదన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కోవూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, అదేవిధంగా పెద్ద పడుగుపాడు పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్–ఉన్–నబీ



బుచ్చి పట్టణంలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని దామరమడుగు, రేబాల, కాగులపాడు, జొన్నవాడ, మునులపూడి, నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో శుక్రవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మిలాద్–ఉన్–నబీ సందర్భంగా పట్టణంలో శాంతి ర్యాలీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవం సందర్భంగా పలువురికి అన్నదానం, వస్త్రదానం చేశామన్నారు. దేశ సమగ్రత కోసం ర్యాలీ చేశామని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మద్దతు ధర లభించడం లేదు



మాట్లాడుతున్న మిడతల రమేష్

పొదలకూరు: ధాన్యానికి మద్దతు ధర లభించడం లేదని, కౌలు రైతులకు నష్టమే మిగులుతోందని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ అన్నారు. పొదలకూరులోని పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం మాట్లాడారు. పుట్టి రూ.15 వేల నుంచి రూ.16 వేలు కూడా లభించడం లేదన్నారు. జిల్లాలో 30 వేల కౌలు రైతులు ఎడగారులో కేఎన్ఎం, 1010 రకం వరి సాగు చేశారని, గిట్టుబాటు ధరలు లభించని కారణంగా ఎకరానికి రూ.7 వేల నుంచి రూ.10 వేలు నష్టపోతున్నట్టు తెలిపారు. ఇలాంటి నష్టాలే వస్తుంటే పచ్చని పొలాలు బీళ్లుగా మారే పరిస్థితులు ఏర్పడుతాయని విమర్శించారు. బీజేపీ నాయకులు రైతులకు సహకారం అందించాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు ధనుంజయరావు, చిన సుబ్రహ్మణ్యం, చౌప్పా వెంకటేశ్వర్లు, రవీంద్రబాబు, రంగారావు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో వివిధ విభాగాలకు నియామకాలు

కోవూరు: వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. జిల్లా రైతు విభాగానికి సంబంధించి కోవూరుకు చెందిన శివుని నరసింహులురెడ్డి, కమిటీ సభ్యులుగా విజయసేనారెడ్డి, మన్నెం నాగేంద్ర, జిల్లా ప్రచార కమిటీలో కార్యదర్శిగా నెల్లూరు వెంకటరమణయ్య, కార్యనిర్వహణ సభ్యులుగా చేజర్ల సుధాకర్‌రెడ్డి, కనిశెట్టి సుబ్రహ్మణ్యం ఉన్నారు. జిల్లా ఇంటలెక్చువల్ కార్యదర్శిగా గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా తోడేటి మహేష్ ఉన్నారు. జిల్లా యూత్ వింగ్ ఉపాధ్యక్షుడిగా దేవరం సాయియశ్వంత్‌రెడ్డి, కార్యదర్శిగా మేకల మోషే, కార్యనిర్వహణ సభ్యులుగా మానికల శ్రీనివాసులు, వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శులుగా కోడూరు పవన్‌కుమార్, కట్టా శ్రీనివాసులు, చేనేత విభాగం ఉపాధ్యక్షులుగా జొన్నాదుల రవికుమార్, ప్రధాన కార్యదర్శులుగా బైన సురేంద్ర, జక్కల ప్రసాద్, సోషల్ మీడియా కార్యదర్శిగా తన్నీరు శేషు, కమిటీ సభ్యుడిగా రాకేశ్, దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శిగా కొండూరు శ్రీనివాసులు, అంకెం సుధీర్‌కుమార్, పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శిగా సంగం వెంకయ్య, కార్యదర్శిగా మేనాటి మణి, సభ్యులుగా గుమ్మా రఘురామయ్య, మున్సిపల్ విభాగం కార్యదర్శిగా మోరల భరత్, సభ్యులుగా షేక్.షబ్బీర్, శేషగిరి, పమజుల గోలి కమలాకర్, సుధాకర్, వలంటీర్ల విభాగం కార్యదర్శిగా కవరగిరి ప్రసాద్, సభ్యులుగా పగడాల సుధా, బొమ్మిరెడ్డి శిరీష, గండవరపు సురేఖ, వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శిగా తురక భాస్కర్, సభ్యులుగా గుమ్మా భాస్కర్, విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా బిరుదవోలు గణేష్‌రెడ్డి, సభ్యులుగా జలీల్, ఎస్సీ సెల్ కార్యదర్శిగా సోనగిరి జగన్, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శులుగా నలబాయి ప్రతాప్, అద్దూరు దయాకర్, కార్యదర్శులుగా అద్దురు కిష్టయ్య, రాచగిరి మణి, సభ్యులుగా కత్తి సుశీల, మైనారిటీ విభాగం కార్యదర్శిగా కరిముల్లా, సభ్యులుగా మౌలాలి, మహిళా విభాగం కార్యదర్శిగా యేడెం లక్ష్మీకుమారి, సభ్యులుగా వేగూరు కాంతమ్మ, లీగల్ సెల్ కార్యదర్శిగా గోమాతం బాలకృష్ణ, ఐటీ విభాగం ఉపాధ్యక్షుడిగా రాతికొండ రవిచంద్ర, సభ్యులుగా కొటపూరి రాజేష్, గ్రీవెన్స్ విభాగం ప్రధాన కార్యదర్శిగా కొండ శ్రీనివాసులురెడ్డి, సభ్యులుగా మేనాటి శ్రీధర్, కళాకారుల విభాగం ఉపాధ్యక్షుడిగా చీమల రమేష్, కార్యదర్శిగా సుధీర్, క్రిస్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శిగా జాషువా, బూత్ కమిటీ విభాగం ఉపాధ్యక్షుడిగా ముమ్మిడి కృష్ణారెడ్డి, సభ్యుడిగా వేమారెడ్డి శివకుమార్‌రెడ్డి, బీసీ సెల్ కార్యదర్శిగా శెట్టిపల్లి వేణు మహేష్, సభ్యుడిగా కాలేషా, అంగన్‌వాడీ విభాగం కార్యదర్శిగా భీమతటి జ్యోత్స్న, సభ్యులుగా పాట్లూరు ప్రమీలమ్మ నియమితులయ్యారు.

విఘ్నేశ్వరునికి విశేష పూజలు



ఇందుకూరుపేట: మైపాడులో..



మనుబోలు: బొజ్జ గణపయ్య గ్రామోత్సవం

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు పంచాయతీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరునికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ రకాల పుష్పాలు, పండ్లతో అలంకరించారు. భక్తులు స్వామివారికి పండ్లు, ప్రసాదాలు అందజేశారు. పూజల సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది.

వైభవంగా గ్రామోత్సవం

మనుబోలు: మనుబోలులోని అంకమ్మతల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య గ్రామోత్సవాన్ని గురువారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవం వెంట ఏర్పాటు చేసిన డీజే, మంగళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవానికి ముందు లడ్డూకు వేలం నిర్వహించగా రూ.55 వేలకు మద్దూరి హహేష్ దక్కించుకున్నారు. అలాగే వినాయకుని మెడలో వేసిన నోట్ల మాలను రూ.30 వేలకు కోసూరు శ్రీనివాసులు, కాకుమూడి రాజేష్ దక్కించుకున్నారు. అనంతరం అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించి గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



ప్రత్యేకాలంకరణలో స్వామి అమ్మవార్లు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా శుక్రవారం శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులకు నిర్వాహకులు ముత్యాల తలంబ్రాలను అందజేశారు. అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. దేవస్థానం నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



కొడవలూరులో..



పొదలకూరులో..

కొడవలూరు: టీచర్స్ డే సందర్భంగా మండలంలో 16 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, ఒక సీఆర్ఎంటీని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎంపీపీ గాలి జ్యోతి హాజరై, మాట్లాడారు. సమాజంలో గురువుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఎంఈఓ జి.వసంతకుమారి మాట్లాడుతూ సమాజానికి మంచి పౌరులను అందించాల్సిన బాధ్యత గురువుల పైనే ఉందన్నారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు కేవీ సత్యనారాయణ, డి.ఓబులేసు, ఎం.మోహన రామలింగయ్య, బి.లక్ష్మీకాంతం, ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

➡ **పొదలకూరు :** స్థానిక ఏపీటీఎఫ్ 257 భవన్‌లో గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను శుక్రవారం సన్మానించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ.దుర్గారెడ్డి, ఎం.కృష్ణయ్య, కె.చిన్నయ్య, ఆర్.ఆదిశేషారెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.